## బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఎం 'భట్టి'


భట్టికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉన్నతాధికారులు

మధిర, డిసెంబర్14: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సచివాలయంలో ఉదయం 8.21గంటలకు తన చాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్ఛరనాలు, ఆశీర్వచనాల మధ్య ఆర్థిక, ఇంధన ప్రణాళిక మంత్రిత్వ శాఖల బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సీఎంకు ఆర్థిక ప్రత్యేకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రాన్స్కో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఆర్థిక కార్యదర్శులు శ్రీదేవి, ఉన్నతాధికారులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, లక్ష్మణ్, ఆదిశ్రీనివాస్, సంజీవరెడ్డి, ఐలయ్య, రాగమయి, మల్లారెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఐఈవో

మధిర, డిసెంబర్ 14: మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డీఐఈవో రవిబాబు సందర్శించారు. కళాశాలలో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్, ల్యాబ్, ఎంసెట్ క్లాసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైన్స్ విద్యార్థులకు అటెండెన్స్ పర్సంటేజ్ పెంచాలని సూచించారు. మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో ఓజేటీలో ట్రైనింగ్‌లో ఉన్న ఒకేషనల్ నర్సింగ్ కోర్సు విద్యార్థినుల శిక్షణను డీఐఈవో రవిబాబు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైదాస్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎర్రుపాలెం, డిసెంబర్ 14: మండల పరిధిలోని వెంకటాపురంలో బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పల్లె దవాఖాన వైద్యులు చెరుకుమల్లి కుమారి సీజనల్ వ్యాధులు, ఎన్‌సీడీ కార్యక్రమాలపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు వరలక్ష్మి, ఎస్‌కే.సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి


సమావేశంలో నోడల్ ఆఫీసర్ వీరస్వామి

కూసుమంచి, డిసెంబర్ 14: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని నోడల్ ఆఫీసర్ వీరస్వామి అన్నారు. మండలంలోని కూసుమంచి, మల్లేపల్లి కాంప్లెక్స్ పాఠశాలల్లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థిని ప్రమాణికంగా తీసుకొని విద్య అందివ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు తుమ్మ శ్రీనివాసరావు, పీవీఎస్‌ఆర్ మూర్తి, రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీ శ్రీదేవి, ఉపేందర్, సీఆర్‌పీలు వడ్లముడి వెంకటేశ్వర్లు, జాఫర్ పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన యూటీఎఫ్

మధిరరూరల్, డిసెంబర్ 14: స్థానిక మైనార్టీ గురుకుల విద్యాలయాన్ని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ రావిరాల లక్ష్మణరావు సందర్శించారు. యూటీఎఫ్ మధిర మండల అధ్యక్షుడు ఎ.వినోద్‌రావు అధ్యక్షతన ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర సబ్‌కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఉపాధ్యాయుడు క్రాంతికుమార్‌కు అభినందనలు తెలిపారు. షేక్ లాల్‌అహ్మద్, కొండలరావు, సాంబయ్య, శంకర్, కవిత, ఉషా, రఫీ, శేషగిరిరావు, కృష్ణయ్య, రాంబాబు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఇంధన పొదుపు దినోత్సవం


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

మధిర, డిసెంబర్ 14: మున్సిపాలిటీలోని మడుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా ఇంధన పొదుపుపై ప్రధానోపాధ్యాయుడే సీహెచ్. సాదుసమాధానం అవగాహన కల్పించారు. తోట నరసింహారావు, బూసా కోటేశ్వరరావు, కే.ఆదాం, పీ.కిశోర్, ఎస్.రామిరెడ్డి, కే.కృష్ణయయ్య, టీ.జ్యోతిర్మయి, రాణి, బీ.చైతన్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సేవాసమితి ఆధ్వర్యంలో వితరణ

ఖమ్మం రూరల్, డిసెంబర్ 14: స్తంభాద్రి సేవాసమితి ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగులకు గురువారం పాలు, పండ్లు, బియ్యం వితరణ చేశారు. మండలంలోని కరుణగిరి జ్యోతి నివాస్ అంధుల, మూగ పిల్లలకు అవసరమైన బిస్కెట్లు, పాలు, పండ్లతో పాటు 3 క్వింటాళ్ల బియ్యం సంఘం సభ్యులతో కలిసి కన్వీనర్ తూములూరి లక్ష్మీనర్సింహారావు అందజేశారు. పెనుగొండ శ్రీనివాసరావు, రాయపుడి వెంకటేశ్వరరావు, జంగిలి రమణ, దేవరశెట్టి రామారావు, కోటేశ్వరరావు, సంపత్‌కుమార్, రమణారెడ్డి, సుధీర్‌కుమార్, సిస్టర్ సోఫియా పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన మంత్రి పొంగులేటి


పొంగులేటిని అభినందిస్తున్న మంత్రి తుమ్మల

కూసుమంచి/ఖమ్మం, డిసెంబర్ 14: పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రిగా సెక్రెటెరియట్‌లో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని 10,11,12 బ్లాక్‌లు కేటాయించారు. బాధ్యతలు చేపట్టిన పొంగులేటికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపాన వారిలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, జారె ఆదినారాయణ, బాలునాయక్, ఆది శ్రీనివాస్, యశస్విని రెడ్డి, రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాసరాజు, సమాచారశాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జేడీలు జగన్, శ్రీనివాస్, వెంకటరమణ, సీఈ రాధాకృష్ణ, నాయకులు రామసహాయం సురేందర్‌రెడ్డి, రేణుకా చౌదరి, రాయల నాగేశ్వరరావు, నిరంజన్‌రెడ్డి, స్వర్ణకుమారి, నరేశ్‌రెడ్డి, మల్లారెడ్డి, రవికుమార్, గోపాల్‌రావు, రమేశ్, సీతారామలు, శ్రీనివాస్, అశోక్, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, హఫీజుద్దీన్, మంకెన వాసు, స్వర్ణ, మంగీలాల్, రమ్య ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం గురువారం తొలి సంతకాన్ని భువనగిరి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ రెవెన్యూ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఇచ్చిన దస్తావేజుపై సంతకం చేశారు. 33 జిల్లాల డీపీఆర్‌ఓల కార్యాలయాలను అనుసంధానం చెసే అధునాతన కెమేరాలను అందజేసే ఫైల్‌పై సంతకాన్ని చేశారు.

### స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి

కూసుమంచి,డిశంబర్ 14: శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్ పదవి ఏకగ్రీవం కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు

తిరుమలాయపాలెం/ఖమ్మం రూరల్, డిసెంబర్ 14: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బోడ మంగీలాల్, బెల్లం శ్రీనివాసరావు, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, ఉప్పునూతల నాగేశ్వరావు, అజ్మీర అశోక్, కేవీ చారి శుభాకాంక్షలు తెలిపారు. చింతకాని మండల నాయకుడు కిలారు మనోహర్‌బాబు పలువురు నాయకులతో కలిసి రెవెన్యూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

## రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

కూసుమంచి, డిసెంబర్ 14: రైతులు నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిని వేసుకోవాలని ఏడీఏ విజయ్ చంద్ర అన్నారు. కూసుమంచిలోని రైతువేదికలో గురువారం జరిగిన స్వచ్ఛంద సేవా సంస్థ రైతు అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలని కోరారు. అనంతరం వరి ధాన్యం సంచులను యాసంగి కోసం అందజేశారు. ఏవో రామడుగు వాణి, సంస్థ ప్రతినిధులు, ఏఈవోలు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థిని అభినందించిన కలెక్టర్

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 14 : అండర్-17 స్కూల్ గేమ్స్ నేషనల్‌కి కొత్తగూడేనికి చెందిన డి.సాయిచరణ్ అనే విద్యార్థి ఎంపికయ్యాడు. ఢిల్లీలో జరిగే స్కూల్ గేమ్స్‌లో పాల్గొననున్నారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల గురువారం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

## చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 14 : చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుచరిత గురువారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం పెద్దబజార్‌కు చెందిన అయితా రాజ్యలక్ష్మి వద్ద భద్రాచలంకు చెందిన గుడుమాసు శత్రుఘ్నకుమార్ అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చేందుకు 2016 సెప్టెంబర్ 10న చెక్కును రాజ్యలక్ష్మికి ఇవ్వగా ఆమె తన ఖాతాలో జమ చేయగా చెక్‌బౌన్స్ అయింది. దీంతో శత్రుఘ్నకుమార్‌కు ఏడాది జైలుశిక్షతోపాటు రాజ్యలక్ష్మికి రూ.8.30 లక్షలు చెల్లించాలని తీర్పు వచ్చింది.

## పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి


చింతకానిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్యాంసన్

చింతకాని, డిసెంబర్ 14: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని మండల విద్యాధికారి మోదుగు శ్యాంసన్ గురువారం అన్నారు. చింతకాని కాంప్లెక్స్ హెచ్‌ఎం భాగవతుల వెంకటేశ్వరశర్మ అధ్యక్షతన చింతకాని ఉన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో యూడైస్ ప్లస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల భౌతిక వనరులను సక్రమంగా పూర్తి చేయించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలని, సన్నబియ్యంతో వారానికి 3 రోజులు గుడ్డుతో పౌష్టికాహారంతో భోజనం అందించాలని ఆయన సూచించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం భాగవతుల వెంకటేశ్వరశర్మ, ఎంఎన్‌వో వీరపనేని శ్రీనివాసరావు, సెక్రెటరీ రమణారావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికా సాధికారిత క్లబ్‌లతో ప్రయోజనం


మాట్లాడుతున్న ఎస్సై ఎస్‌కే షాకీర్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 14: పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలికా సాధికారిత క్లబ్‌లతో విద్యార్థినులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని రూరల్ ఎస్సై ఎస్‌కే షాకీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జలగంనగర్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం శ్యాంసన్ అధ్యక్షతన జరిగిన బాలికా సాధికారిత క్లబ్ సమావేశంలో ఎస్సై బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. బాలికలు తమ సమస్యలను తామే పరిష్కారం చేసుకునేందుకు ఈ క్లబ్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. బాలికలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 1098, 100, 118, 112కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ ఉపాధ్యాయురాలు ఆర్ ఆదిలక్ష్మి, ఉమెన్ కానిస్టేబుల్ నాగేంద్రమ్మ, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎస్‌కే షాకీరాబేగంతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 14 : ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లో తుపాకుల మోత మోగింది.. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన భీకరపోరులో ఇద్దరు మావోయిస్టులు నేలకొరిగారు. వివరాల్లోకెళ్తే.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని బోధింటోల సమీపంలో మావోయిస్టులు భారీ ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన ఇంటలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు పోలీస్ అధికారులు కూంబింగ్ ఆపరేషన్‌కు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ బలగాలు, సీ-60కమాండోలు సంయుక్తంగా సెర్చింగ్ నిర్వహిస్తుండగా గడ్చిరోలి జిల్లాలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో గల గోడల్వాయి ఔట్ పోస్ట్ వద్ద మావోయిస్టులు తారసపడి పోలీస్ బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు గంటసేపు భీకరపోరు జరిగింది. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అటవీమార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని సీజ్ చేసి సెర్చింగ్ ప్రారంభించారు. ఈ క్రమంలో ఘటన స్థలంలో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో వారికి సంబంధించిన మారణాయుధ, వస్తు సామగ్రి లభించినట్లు గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ వెల్లడించారు. మృతుల్లో ఒకరు 2019వ సంవత్సరంలో జరిగిన జంబుల్ఖేడా ఘటనలో ప్రధాన సూత్రధారి, మావోయిస్టు పార్టీ కసనూర్ దళం కమాండర్ దుర్గేశ్ వట్టిగా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనతో మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను అప్రమత్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి జవాన్ మృతి

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు దూకుడు పెంచుతున్నారు.. మూడ్రోజుల క్రితం మావోయిస్టులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి నలుగురు జవాన్లు గాయపడిన విషయం విదితమే.. కాగా నారాయణ్‌పూర్ జిల్లాలో సైతం ల్యాండ్‌మైన్ పేలి జవాన్ మృతిచెందాడు. ఈ ఘటన జరిగిన 24గంటల్లోపే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లాలో మరో బీఎస్‌ఎఫ్ జవాన్ నేలకొరిగాడు. వివరాలిలా ఉన్నాయి.. కాంకేర్ జిల్లా పర్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్‌ఎఫ్), జిల్లా పోలీస్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కూంబింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో సదక్టోల గ్రామ సమీపంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బ్లాస్ట్ అయ్యి జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి జవాన్లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి హుటాహుటిన పఖంజూర్ దవాఖానాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు అఖిలేష్ రాయ్(45) బీఎస్‌ఎఫ్ భద్రతా విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా అధికారులు వెల్లడించారు. నారాయణ్‌పూర్ జిల్లాలో బుధవారం ల్యాండ్‌మైన్ పేలిన ఘటనలో సీఏఎఫ్ జవాన్ మృతిచెందాడు.